# శ్రీవారి ముచ్చట్లు

ఊహారం స'రసం'

—సూరేపల్లి విజయ

'వేసవి కాలం. మేడపై, వెన్నెల మీద పడుతున్న అర్ధరాత్రి వేళ, దేవతా వస్త్రాలతో, మల్లెపూల పక్క మీద రొమాంటిక్ వార్ ఎలా వుంటుంది?

షర్మిల తెల్లని పొట్టమీద పెదాలు అన్చి, ఆ పెదాలతోనే అడుగు లేస్తూ నడుం ముడతను మజిలీగా చేసుకుని, అక్కడున్న బ్యూటీ స్పాట్ పుట్టుమచ్చ మీద అడుగులుగా, మార్చిన పెదాలను తుమ్మెదగా మార్చి తనపైన ముద్ర వేస్తూ అడిగాడు శశాంక.

షర్మిల నవ్వింది తన బుగ్గలు సొట్టలు పడేలా! బెడ్ ల్యాంప్ వెలుతురులో ఆమె చిర్నవ్వు మెరుపైంది. ముక్కు పుడక తళుక్కుమని ఆ మెరుపుకు ప్రత్యక్ష సాక్షిగా మిగిలింది.

'చిన్న ముద్దుకోసం ఇన్ని మాటలతో టైం వేస్ట్ చేయడం కార్యశూరుల లక్షణం కాదంటాను' అతని తలను తన గుండెల మధ్య బంధిస్తూ అంది షర్మిల.

ఆమె అతనిలో మమేకం కావాలనుకుంటోంది. ఈ శృంగార యుద్ధం ఆమెకు కొత్తకాదు. వాళ్ళ పెళ్ళయి ఆరేళ్ళు గడుస్తున్నా, ఎప్పుడు ఇద్దరికీ మొహంమొత్తలేదు. నిరాటంకంగా వాళ్ళ శృంగార యుద్ధం కొనసాగుతూనే వుంది. ఎప్పుడూ ఇద్దరూ విజేతలే. ఒకరితో మరొకరు పోటీపడుతూ పరాకాష్టకు వెళ్ళి పయోధ్యకొచ్చి అతని ఆమె పయ్యోదను తన 'శయ్య'గా మార్చుకుంటాడు.

ఆమె అతని శరీరాన్ని దుప్పటిగా కప్పుకుంటుంది.

'షర్మిలా.. నువ్వు రోజు రోజుకీ అందంగా తయారవుతున్నావు. వయసు పెరిగే కొద్దీ అందమూ పెరుగుతుంది. ఏమిటా రహస్యం?' ఆమె పైటను తప్పిస్తూ అడిగాడు.

'ఫెయిర్ అండ్ లవ్లీ, సంతూర్, ఏకోటర్నరిక్' నవ్వుతూ అంది. అతనికి సహకరిస్తూ...

ఆమె రిటార్ట్ అర్థమయింది. అలాగే ఆమెను అల్లుకుపోతూ ఆమెతో శృంగార యుద్ధం మొదలెట్టాడు. ఆ శృంగారాన్ని చూసి కిటికీలో నుండి పడుతోన్న వెన్నెల వేడి నిట్టూర్పులు విడిచింది. వాళ్ళిద్దరి కింద నలుగుతున్న మల్లెలు ఉద్వేగంగా ఊపిరి బిగబట్టి చూస్తున్నాయి.

క్షణాలు కరిగి, శరీరాలు మమేకమై, తన్మయత్వం గమ్యస్థానమైంది.

* * *

షర్మిల ఒడిలో సేద తీరుతున్నాడు శశాంక.

'షర్మిలా' పిలిచాడు. ఆమె చేతిని తన పెదాలకు ఆన్చుకుని.

'చెప్పండి... మళ్ళీ యుద్ధమా? నేను రడీ' అతన్ని ఆట పట్టిస్తూ అల్లరిగా అంది షర్మిల.

'నీతో ఎప్పట్నుంచో చెప్పాలనుకుంటోన్న ఓ మాట... పెదవి దాటి రావటం లేదు.'

'భార్యాభర్తల మధ్య దాపరికాలు వుంటే వుండొచ్చేమోగానీ పెదవి దాటి, రాని చెప్పాలనుకున్న మాటలు మాత్రం పెదవుల్లోనే వుండకూడదు. కక్కేయండి' అంది నవ్వుతూనే.

'చెప్పాక సీరియస్సవ్వకూడదు.'

'ఊహు... అవ్వను.'

'నవ్వకూడదు.'

'నవ్వను.'

'ముఖ్యంగా నన్నో పిచ్చాడిలా చూడకూడదు.'

'సరే మహానుభావా.. అసలు విషయం చెప్పండి.'

'కాలేజీ రోజుల్నుండి నా కోరిక ఒకటుంది.'

'ఏంటో సెలవివ్వండి.'

'గాళ్ ఫ్రెండ్తో సరదాగా తిరగాలని, ఆట పట్టించాలని, షికార్లు కొట్టాలని...' అని ఆగి భార్య మొహంలోకి చూశాడు. ఎక్స్ప్రెషన్స్ ఏమైనా మారాయేమోనన్న భయంతో.

'ఇంకా శృంగార యుద్ధాలు చేయాలని లేదా?' అడిగింది అతని జుట్టులోకి వేళ్ళు పోనిస్తూ.

'ప్చ్... పెళ్ళయి పోయింది కదా...'

'పోనీ నేనే గాళ్ ఫ్రెండ్ని అనుకోండి. నన్నే ఆట పట్టించండి. నాతో షికార్లు కొట్టండి. నేను రెడీ' అంది షర్మిల.

'నువ్వు భార్యవని తెలిసాక థ్రిల్లేముంటుంది?'

'పోనీ ఓసారి గాళ్ ఫ్రెండ్కోసం బస్స్టాపుల్లో ట్రయ్ చేయండి.'

'అందుకే నీ పర్మిషన్ కోసం' ఆమె నడుం చుట్టూ చెయ్యివేసి నడుం మడత మీద ముద్దు పెట్టుకుంటూ అన్నాడు.

ఒక్క క్షణం విభ్రాంతిగా చూసింది. ఇప్పటి దాకా ఏదో సరదాగా అంటున్నాడనుకుంది. తనకు తెలిసి శశాంక చాలా బుద్ధిమంతుడు. అబద్ధాలాడ్డం, మనసులో కల్మషం దాచుకోవడం, లేని ప్రేమను నటించడం అతనికి చేతకాదు. పెళ్ళయి ఆరేళ్ళయినా, తమకు పిల్లలు లేకపోయినా, లోపం తనలోనే వుందని డాక్టర్లు చెప్పినా తనను ప్రేమగానే చూసుకుంటున్నాడు. తను పిల్లల కోసం రెండో పెళ్ళి చేసుకోమంటే ఆ రోజంతా తన ఒడిలో పడుకొని చిన్న పిల్లాడిలా ఏడ్చాడు. 'నాకు పిల్లలొద్దు. నువ్వు నాకు బిడ్డవి, నేన్నీకు బిడ్డని' అన్నాడు. అలాంటి శశాంక.

'ఆశ్చర్యపోతున్నావా షర్మిలా. ఇది పదేళ్ళుగా నాలో తీరని కోరికగా మిలిగిపోయింది. కాలేజీ రోజుల్నుంచి నాకు ఈ కోరిక వుండేది. తోటి ఫ్రెండ్స్ గాళ్ ఫ్రెండ్స్తో తిరుగుతుంటే ఈర్ష్యగా వుండేది. నాకూ అలాగే తిరగాలనిపించేది. అమ్మాయిలను ఆట పట్టిస్తూ రొమాంటిక్ హీరోగా వుండాలనిపించేది. కాని పేదరికం నా కోరికలను సమాధి చేసింది.

డిగ్రీ అయిపోగానే అదే పేదరికం



ఉద్యోగం చూసుకోమని హెచ్చరించింది. అంతే ఉద్యోగం వేట... తరువాత బ్యాంకు ఆఫీసర్‌గా ఉద్యోగం రావటం, పెళ్ళి కావటం జరిగిపోయాయి. ఆ తరువాత నీ సాహచర్యంలో ఈ ఆలోచన మరుగున పడింది. కానీ అప్పుడప్పుడు ఈ తీరని కోరిక....' అతను చెప్తూ ఆగిపోయాడు.

మనసులోని చిన్న ఫీలింగ్ కూడా దాచుకోలేని చిన్న పిల్లాడి మనస్తత్వం.

'మీకు ఆడ పిల్లల్ని టీజ్ చేయడం కూడా వచ్చా?' నవ్వుతూ అంది షర్మిల.

'బ్రహ్మాండంగా వచ్చు' ఉక్రోషంగా అన్నాడు శశాంక.

'ఓ.కె... నెల రోజులు టైమిస్తున్నాను. నెల రోజుల్లో కనీసం ఒక్కమ్మాయినైనా ట్రాప్ చేయండి.'

'హమ్మో... ట్రాప్ చేయడమంటే.. జస్ట్ పరిచయం చేసుకుని, నా వెంట తిప్పుకుంటాను. అంతే. అంతకు మించి ఇంకేమి చేయను. నీమీదొట్టు' సిన్సియర్‌గా అన్నాడు శశాంక.

'నవ్వింది షర్మిల. గాల్‌ఫ్రెండ్ కోసం, అమ్మాయిని టీజింగ్ చేస్తానని అదీ తన పర్మిషన్‌తో అనడం... నవ్వు తెప్పించింది.

* * *

ఆ అమ్మాయితో ఎలా పరిచయం చేసుకోవాలో అర్థం కాలేదు. ఆమె కొంతల గూర్చి కామెంట్ వేస్తే?

కొడుతుందేమో! అరుస్తుందేమో! అల్లరి చేస్తుందేమో!

ధైర్యం చేసి ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళాడు.

'ఎక్స్‌క్యూజ్‌మీ' అన్నాడు మరింత ధైర్యం చేసి.

'చెప్పండంకుల్' అందా అమ్మాయి.

గొంతులో వచ్చి వెలక్కాయ పడ్డ ఫీలింగ్ కలిగింది శశాంకకు. తనని అంకుల్ అంది. అంటే తను ముసలాడు అయ్యాడని ఆ అమ్మాయి వుద్దేశమా?

శశాంక ఆ డైలమాలో వుండగానే 'మీరా శశాంక... ఏమిటి మ్యాటరేమయింది? ఇవాళ బ్యాంకు లేదా?' అన్న పలకరింపు విని ఉలిక్కిపడి వెనక్కి చూశాడు.

ఎదురింట్లో వుండే రామారావు.

ముఖ పరిచయం మాత్రమే.

'ఆ... అవునవును. కాదు... కాదు... స్కూటర్ సర్వీసుకు ఇచ్చాను. బ్యాంకుకు సెలవు పెట్టాను' గుటగుటా పాఠం అప్పగించిన ట్టుగా చెప్పాడు. అవును, కాదులను కలగలిపి.

'అలాగా ... అన్నట్టు ఈ అమ్మాయి నా కూతురు. పేరు కావ్య. వైజాగ్‌లో చదువుతుంది. నిన్ననే వచ్చింది.' కూతురి వైపు చూసి 'కావ్యా, మన ఎదురింట్లో వుంటారు. పేరు శశాంక. బ్యాంకులో జాబ్' అంటూ వివరాలతో సహా చెప్పుకొచ్చాడు రామారావు.

కరెంట్ షాక్ కొట్టినట్టు ఉలిక్కి పడ్డాడు. ఓ వెర్రి నవ్వు నవ్వి తనూ విష్ చేశాడు. అలా ఆ రోజు అతని మూడ్ ఆఫ్ అయ్యింది. బెటర్ లక్ నెక్స్ట్ డే.

* * *

సెకండ్ డే!

ఈసారి మరో బస్టాప్‌కు షిఫ్ట్ అయ్యాడు.

ఆ వేళ అతని అదృష్టం చీరల డిస్కౌంట్‌లా సగం బాగుంది. రష్ ఎక్కువగా లేదు. ఓ ఇరవయ్యేళ్ళ అమ్మాయి బస్‌కోసం ఎదురు చూస్తోంది. మెల్లిగా దగ్గరికి వెళ్ళాడు. ఎవరూ తనని గమనించడం లేదని కన్ఫర్మ్ చేసుకుని, లోగొంతుకతో ఆమెకు మాత్రమే వినిపించేలా 'థర్టీ టూ' అన్నాడు.

సరిగ్గా అప్పుడే బస్సొచ్చింది.

ఆ అమ్మాయి సందిగ్ధంగా ఆగి శశాంక వైపు చూసింది. కాసింత ఉత్సాహం వచ్చి 'థర్టీ టూ' అన్నాడు.

ఆ అమ్మాయి మొహంలో చిర్నవ్వు. శశాంక ఛాతీ ఎట్‌లీస్ట్ రెండు అంగుళాలు అయినా పొంగి వుంటుంది.

'థాంక్యూ సార్' అంటూ తడుముకుంటూ వెళ్ళి బస్సెక్కింది. తనకు థాంక్స్ చెప్పి, బస్సెందుకు ఎక్కిందో అర్థంకాలేదు. పైగా తడుముతూ... అంటే ఆ అమ్మాయి బ్లైండ్... నాలిక్కరుచుకుని బస్ వైపు చూసి, ఈసారి నాలిక కొరుక్కోవాలనుకున్నాడు. బస్ నెంబర్ థర్టీ టూ. అంటే ఆ అమ్మాయి థర్టీ టూ బస్



కోసం ఎదురు చూస్తుందన్నమాట.

పూర్ శశాంక...

* * *

థర్డ్ డే...!

ఈసారి వచ్చేటప్పుడు కనీసం ముక్కోటి దేవతల్లో, కోటి మంది దేవుళ్ళకైనా మొక్కి వుంటాడు. కానీ పైనున్న తథాస్తు దేవతలు కామ్‌గా వుండిపోయారు.

ఈసారి లొకేషన్ సిక్స్ నెంబర్ బస్టాప్.

నలుగురైదుగురు అమ్మాయిలున్నారు. అందులో ఓ అమ్మాయిని ఎన్నుకున్నాడు. వయసు ముప్పయి వుండొచ్చు.

బస్సులు యథావిధిగా వస్తున్నాయి, వెళ్తున్నాయి. ఆమె మాత్రం అక్కడే ఉంది. మిగతా ముగ్గురు అమ్మాయిలు వెళ్ళిపోయారు. ఒక్కరై మిగిలింది.

'హలో' అన్నాడు గొంతు తగ్గించి ఆమెకు మాత్రమే వినిపించేలా.

'ఆమె అలాగే నిలబడి బస్‌కోసం చూస్తుంది.

'హలో... థర్టీ ఫోర్' అన్నాడు కాస్త ధైర్యం చేసి

ఆమె శశాంక వైపు తిరిగి 'ఏమిటి? అన్నట్టు చూసింది.

'మీ... మీ.....' తడబడ్డాడు.

ఆమె శశాంక పెదవుల కదలికను చూసి అంచనా వేస్తున్నట్టు 'పాపం... న ...త్తి' అంది నిట్టూరుస్తూ.

ఎదురుగా వచ్చే బస్ కింద తల పెట్టాలనిపించింది.

'నాకేం నత్తి లేదు' కోపంగా, ఉక్రోషంగా అన్నాడు.

'ఏంటి బస్సులు రావట్లేదని చికాకు పడుతున్నారా?' అడిగింది అతని మాటలు అర్థం చేసుకున్నట్టు ఎక్స్‌ప్రెషనిస్తూ.

కోపాన్ని అణచి పెట్టుకొని, నవ్వు పులుముకొని 'మీరు చాలా అందంగా వున్నారు' అన్నాడు.

'ఏంటి ... నన్నెక్కడో చూసినట్టుందా... లేదే... నేను మిమ్మల్ని ఎక్కడా చూడలేదు' అంది పొలయిట్‌గా.

బిత్తరపోయాడు శశాంక.

'అది కాదు మిస్ మీరు చాలా అందంగా....'

'ఏంటి కాఫీనా వద్దండి అయినా ముఖ పరిచయం అయినా లేని మీతో...'

మెల్లమెల్లగా విషయం అర్థమవసాగింది. అంటే ఆవిడ డెఫ్... నిన్న బ్లైండ్.. ఇవ్వాళ డెఫ్...'

ఆవిడ నవ్వుతూ శశాంక వైపు చూసి 'సారీ... కాఫీకి రానందుకు ఏమనుకోవద్దు... అంటూ తన బస్ రాగానే వెళ్ళిపోయింది.

ప్చ్... శశాంక.

* * *

ఫోర్త్ డే!

ఈసారి చాలా జాగ్రత్తగా డీల్ చెయ్యాలనుకున్నాడు.

అందుకే బస్టాప్ మార్చి రైల్వే స్టేషన్ దగ్గరికి వచ్చాడు. ఈసారి నో వాప్పుడాలు అనుకున్నాడు.

ఓ ముప్పయి – ముప్పయి అయిదు మధ్య వుంటుంది. చూడ్డానికి బాగానే వుంది. మొహానికి పట్టిన చమటను తుడుచుకొని ఆమె దగ్గరకు వెళ్ళాడు. పక్క నెవరూ లేరు. భలే ఛాన్స్ అని ఫీలయ్యాడు.

'హలో' అన్నాడు కాస్త భయంగా.

'హాయ్' అంది.

'మీరు బావున్నారు' కాసింత మొహమాటం.

'నిజంగానా' ఆమె రియాక్షన్.

'అలా కాఫీ తాగుదామా?'

'ఊహు.. నేను కాఫీ తాగను.'

'పోనీ పాలు'

'ఊహు'

'మరి?'

'విస్కీ' హస్కీగా అంది.

అంతే వెనక్కు విరుచుకు పడబోయి తమాయించుకున్నాడు.

'ఆ తరువాత ఏదైనా లాడ్జ్‌కు నేను రెడీ. నా రేటు అయిదు వందలే...' ఆమె నవ్వుతూ అతన్నే చూసి కన్ను గీటింది!

'భువనంలో పి.టి.ఉషను, అశ్వనీ నాచప్పను తలచుకుని పరుగెత్తాడు గంటకు ఇరవై కిలోమీటర్ల స్పీడుతో.

ఎలా వచ్చాడో తెలియదు. బెడ్ రూమ్‌లో దభీమని పడ్డాడు.

* * *

రాత్రి పది దాటింది.

స్పృహలోకి వచ్చాడు. షర్మిల వడిలో వున్నాడు.

'హలో.. మీ ప్రయత్నం ఎంత వరకు వచ్చింది' అడిగింది అతని జుట్టులోకి చెయ్యి పోనిస్తూ. ఇంకా ఇరవై ఆరు రోజుల టైముంది కదా!'

అంతే అతను షర్మిలను చుట్టుకు పోయాడు.

'సారీ... షర్మిలా. ఆ మన్మధరావుగాడి బుద్ధిలేని ఆలోచనకు బలయ్యాను. ఛ... బాగా బుద్ధొచ్చింది. నాకు ఏ ఎక్స్‌పీరియెన్స్ వద్దు. నువ్వే కావాలి' ఆమె గుండెలోని వెచ్చదనాన్ని అనుభవిస్తూ మనస్ఫూర్తిగా అన్నాడు.

'కొన్ని అనుభవాలు అనుకోకుండా జరిగితే థ్రిల్‌గా అందమైన అనుభూతులుగా వుంటాయి. కానీ కావాలని కొని తెచ్చుకునే అనుభూతులు అసహ్యంగా వుంటాయి. అయినా అమ్మాయిలు ఏమైనా చేపలా? వలేస్తే చిక్కడానికి. నాకంతా తెలుసు. మీ ఫ్రెండ్ మన్మధరావు భార్య నా క్లాస్‌మేట్. మీ సంభాషణ విని నాకు చెప్పింది. అవన్నీ చీప్ టెక్నిక్స్. అమ్మాయిల కొలతలు చెప్పి ఫ్రెండ్షిప్ పెంచుకోవడం. మీరెలాంటి వారో తెలుసు. అందుకే మీకు అవకాశమిచ్చాను. రోజూ మిమ్మల్ని గమనిస్తూనే వున్నాను. అయినా మీకే అనుభూతి కావాలన్నా నా తనువు, మనసు రెడీ' అంది అతన్ని అల్లుకుపోతూ.

ఇక షర్మిలను మాట్లాడనివ్వలేదు. తన పెదాలతో ఆమె పెదాలకు బంధం వేసి.

ఆ తరువాత వెండి వెన్నెల... దూకే జలపాతాలు.. కరిగిపోయే క్షణాలు.. ఆవిరయ్యే వేడి నిట్టూర్పులు... షరా మామూలే!

* * *